క్లుప్తంగా

ప్రజా సమస్యల వేదికకు అధికారుల డుమ్మా



ప్రజావేదికలో అధికారులు లేక ఖాళీగా వున్న కుర్చీలు

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కొన్ని శాఖల అధికారులు డుమ్మాకొట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి కేవలం తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ 1 రఘురామిరెడ్డి, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు వెంకటయ్య, ఫణీత్ క్రిష్ణ హాజరయ్యారు. మరో రెండు శాఖల నుంచి కింది స్థాయి అధికారులు పాల్గొన్నారు. మిగిలిన శాఖలకు చెందిన అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. ఆయా శాఖలకు సంబందించిన అధికారులు ప్రతి వారం గైర్హాజరవుతుండడంతో ప్రభుత్వం పనితీరుపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

జాబ్‌చార్ట్ ప్రకాశం విధులు అప్పగించాలి



జిల్లా ఉద్యానవన అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

నంద్యాల(అర్బన్): జాబ్ చార్ట్ ప్రకారం విధులు కేటాయించాలని ఉద్యాన సహాయకుల జేఏసీ నాయకులు వెంకటశివుడు, బాషా, విజయ్, చెన్నయ్య, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసులు కోరారు. సోమవారం ఉద్యానవన శాఖ అధికారి నాగరాజుకు వినతి పత్రం ఇచ్చారు. తాము ఉద్యానవన సహాయకులమైనప్పటికీ తమపై పెత్తనమంతా వ్యవసాయ శాఖ అధికారులదేనన్నారు. వ్యవసాయశాఖ పనులే అప్పగిస్తున్నారని తెలిపారు. ఆరేళ్లుగా ఎలాంటి పదోన్నతులు, బదిలీలు లేవని, ఒత్తిడికి గురవుతూ ఉద్యోగాలు చేస్తున్నామన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న సేవా సమితి సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): వేసవిని దృష్టిలో ఉంచుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు రమణ సత్సంగం సేవా సమితి సభ్యులు సోమవారం మజ్జిగ, పెరుగు అన్నం పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని డిపో మేనేజర్ గంగాధర్‌రావు, అసిస్టెంట్ మేనేజర్ కిశోర్ ప్రారంభించారు. సేవా సమితి సభ్యులను అభినందించారు.

కలెక్టరేట్‌కు ఏసీలు, వాటర్ డిస్పెన్సర్లు వితరణ



ఏసీలు, వాటర్ డిస్పెన్సర్లు అందజేస్తున్న కెనరా బ్యాంక్ అధికారులు

గోస్పాడు: కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కెనరా బ్యాంక్ అధికారులు కలెక్టరేట్‌కు రెండు ఏసీలు, ఐదు వాటర్ డిస్పెన్సర్లను వితరణ చేశారు. సోమవారం కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, కర్నూలు లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ రామచంద్ర సమక్షంలో వీటిని అందజేశారు. కార్యక్రమంలో నంద్యాల కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్‌లు సుబోధ్, అనంత్, రాకేష్ రంజన్, కర్నూల్ బ్రాంచ్ డివిజనల్ మేనేజర్ సురేష్ కుమార్, శివశంకర్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

నంద్యాల(న్యూటౌన్): మేడే స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, నంద్యాల పట్టణ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, భూమన శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో 139వ మేడే వేడుకల సందర్భంగా కార్మిక ప్రదర్శనలు, సభలు, జెండా ఆవిష్కరణలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు రంగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.35వేలు ఇవ్వాలని, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సిమెంట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న వర్కర్లకు ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు సుశీలమ్మ, శ్రీనివాసులు, రమణారెడ్డి, సిద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి 'నో'చుకోక

- నిరుపయోగంగా గోదాములు
- నిర్మాణాలు పూర్తయినా సేవలందించని సచివాలయాలు
- అందుబాటులోకి రాని పాఠశాల అదనపు గదులు



చాకరాజువేములలో ప్రారంభంకాని సచివాలయం



కొండాపురంలో నిరుపయోగంగా గోదాం



దొర్నిపాడులోని జెడ్పీహెచ్ఎస్‌లో వినియోగంలోకి రాని అదనపు గదులు

దొర్నిపాడు: ప్రజల సౌకర్యార్థం, రైతుల సంక్షేమం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నూతన భవనాలను నిర్మించింది. ఎన్నికల ముందు కొన్ని భవనాలు పూర్తికాగా కోడ్ కారణంగా ప్రారంభానికి నోచుకోలేదు. అప్పటి నుంచి నూతన భవనాలు అందుబాటులోకి రాక సచివాలయ ఉద్యోగులు, రైతులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు వాటిని ప్రారంభించే దిశగా అడుగులు వేయక పోవడంతో ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇరుకు గదుల్లో ఇబ్బందులు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు తీసుకురావాలనే లక్ష్యంతో గ్రామస్వరాజ్య స్థాపన కోసం సచివాలయ వ్యవస్థను తీసుకు వచ్చింది. ఇందులో భాగంగానే ప్రతిష్టాత్మకంగా నూతన సచివాలయాలను నిర్మించింది. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో చాకరాజువేముల, గుండుపాపల గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయినపట్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ముఖ్యంగా గుండుపాపల గ్రామంలో ఆదర్శంగా నిర్మాణం చేపట్టారు. భవనం వినియోగంలోకి రాకపోవడంతో ఉద్యోగులు పాత గ్రామ సచివాలయాల్లోని ఇరుకు గదుల్లో ఇబ్బందుల్లో సేవలను కొనసాగిస్తున్నారు. అలాగే కొండాపురం, డబ్ల్యూ గోవిందిన్నె గ్రామాల్లోని సచివాలయాలు పునాదులకే ప్రమితం అయ్యాయి.

బిల్లులు అందక..

దొర్నిపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తరగతి గదులు కొరత ఉండటంతో గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం కింద రూ.1.76కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టింది. అన్ని పనులు పూర్తయినప్పటికీ బిల్లు పెండింగ్ కారణాలతో ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం అనధికారికంగా తరగతులు నిర్వహిస్తున్నప్పటికీ అధికారికంగా ప్రారంభానికి నోచుకోలేదు.

ప్రైవేటు గోదాముల్లో అద్దె చెల్లిస్తూ..

పండించిన పంటను గిట్టుబాటు ధర వచ్చేవరకు దాచుకోవడానికి రైతులు పడుతున్న ఇబ్బందులను చూసి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో గోదాములను నిర్మించారు. ఇందులో భాగంగా గుండుపాపల, క్రిష్టిపాడు, డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ కొత్తపల్లె, కొండాపురం గ్రామాల్లో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు ఒక్కోదానికి రూ.40లక్షలు వెచ్చించి నిర్మించారు. అలాగే వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యంను నిల్వ ఉంచుకోవడానికి రూ. 80లక్షల ఖర్చు చేసి నిర్మాణం చేపట్టారు. ఇవి ప్రారంభానికి నోచుకోకపోవడంతో ప్రస్తుతం రైతులు ప్రైవేటు గోదాముల్లో నిల్వ ఉంచి అద్దెచెల్లిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు గోదాములను వినియోగంలోకి తీసుక వస్తే బాగుంటుందని రైతులు పేర్కొంటున్నారు.



చాకరాజువేములలో నిర్మించిన వెయ్యి మెట్రిక్ టన్నుల గోదాం

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

నంద్యాల(అర్బన్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని నంద్యాల పీసీసీ డెలిగేట్ చింతలయ్య ఆరోపించారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త లక్ష్మీనారాయణను దారుణంగా హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. టీడీపీ నాయకులు టిప్పర్‌తో ఢీకొట్టి దారుణంగా హతమార్చడం హేయమైన చర్య అన్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అప్సా ఏజీఎస్‌గా మాధవీలత

నంద్యాల(న్యూటౌన్): ఏపీ ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ రాష్ట్ర అడిషనల్ సెక్రటరీగా నంద్యాల పట్టణానికి చెందిన రవీంద్ర హైస్కూల్ ప్రిన్సిపాల్ మాధవీలతను ఎంపిక చేసినట్లు నంద్యాల జిల్లా అసోసియేషన్ రవీంద్రనాథ్ సోమవారం తెలిపారు. నియామక పత్రం అందజేశారు. తొలిసారిగా మహిళా విభాగం నుంచి అడిషనల్ సెక్రటరీని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పడకండ్ల సుబ్రమణ్యం, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం

నంద్యాల(అర్బన్): బాల్య వివాహాల నిర్మూలనకు మత పెద్దలు సహకరించాలని హెడ్స్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణయ్యయాదవ్ అన్నారు. స్థానిక నందమూరినగర్‌లో బాల్య వివాహాల నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఏ ఒక్క బాల్య వివాహం జరగకుండా వేదపండితులు, పురోహితులు, పాస్టర్లు, ఇమామ్‌లు, మత పెద్దలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బాలల హక్కుల కమిషన్ మాజీ సభ్యులు రాజేశ్వరమ్మ, సుబ్బరాయుడు, సంతప్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని రూపుమాపాలి

నంద్యాల(వ్యవసాయం): దేశవ్యాప్తంగా ఉగ్రవాదాన్ని రూపుమాపాలని నంద్యాల బార్ అసోసియేషన్ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడులను నిరసనగా సోమవారం న్యాయవాదుల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. మృతులకు సంతాపాన్ని తెలియజేశారు. ర్యాలీ కోర్టు ఆవరణ నుంచి బయలుదేరి టూటౌన్ పోలీస్ స్టేషన్ వరకు కొనసాగింది. టెక్కె రహదారి పైన కొద్దిసేపు నిరసనను తెలియజేసి నినాదాలు చేశారు. సీనియర్ న్యాయవాదులు హుసేన్ బాషా, రామచంద్రరావు, మదాని మాట్లాడుతూ కశ్మీర్‌లో జరిగిన నరమేధం ఉగ్రవాదుల పిరికిపందచర్యగా అభివర్ణించారు. దేశ రక్షణకు భగం కలిగితే కులమతాలకు అతీతంగా భారతీయులందరం ఏకమై ఉగ్రవాదులను తరిమికొడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు, శ్రీదేవి, మురళీ, ప్రతాప్ రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

ఆర్టీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు



రీలే నిరాహార దీక్షలో కుర్చున్న కార్మికులు



నిరాహార దీక్షలో పాల్గొన్న ఎన్ఎంయూ నాయకులు

ఆళ్లగడ్డ: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఎన్ఎంయూఏ నాయకులు రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం చీఫ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 01/2019ను అమలు చేయడంతో పాటు ఈహెచ్ఎస్ పాత విధానాన్ని కొనసాగించాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలన్నిటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో సెక్రటరీ రాజశేఖర్,ప్రసాద్,జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల(వ్యవసాయం): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ డిపో ఆవరణలో ఎన్ఎంయూ నాయకులు సోమవారం నిరాహార దీక్ష నిర్వహించారు. 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, నైట్ సర్వీస్ అలవెన్స్‌ను రూ. 150 నుంచి రూ. 400లకు పెంచాలని, అక్రమ సస్పెషన్లు ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, పాత వైద్య విధానాన్ని అమలు చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలు చెల్లించాలని కోరారు. సంఘం నాయకులు కోటేశ్వరరావు సుబ్బరాజు, శంకర్, రమణ, హనీ, సలాం, నరసింహులు, సందీశ్వరుడు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

రుద్రవరం: గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయం అధికారి సౌరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో సోమవారం సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులు కావడంతో తల్లిదండ్రులు పిల్లలను బయట తిరగనివ్వకుండా గ్రంథాలయానికి పంపాలన్నారు. ఇక్కడ కథల ద్వారా నీతిని బోధించడం, డ్రాయింగ్ ద్వారా సృజనాత్మకతను వెలికి తీయడం, క్యారం బోర్డు, చదరంగం వంటి ఆటల వల్ల తెలివితేటలను పెంపొందించే కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రతి రోజు 8 నుంచి 11 గంటల వరకు తరగతులు ఉంటాయని చెప్పారు.



రుద్రవరం గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు



ఇంజేడు ఊరకుంటలో సేద తీరుతున్న పశువులు

వేసవితాపం నుంచి ఉపశమనం

ఉయ్యాలవాడ : భానుడి ప్రచండ రూపానికి పశుపక్షాదులు సైతం బెంబేలెత్తుతున్నాయి. సోమవారం ఎండ తాకిడికి కాస్త ఉపశమనం పొందేందుకు పశువులు మండలంలోని ఇంజేడు ఊరకుంటలో, కుందూతీరం వెంట వున్న గ్రామాల్లో కుందూనదిలో పశువులు సేదతీరుతున్నాయి. పశు పెంపకందారులు ఉదయాన్నే మేత కోసం తీసుకెళ్లి కొద్ది సేపు పొలం బీడు ప్రాంతాల్లో వాటిని వుంచి.. ఎండ ఎక్కువగా వున్న సమయంలో వాటిని కుందూనదిలో, కుంటల్లో వదులుతున్నారు. నీటిలో పశువులు సేద తీరితే వేసవి కాలం పాల ఉత్పత్తులు కూడా తగ్గకుండా వుంటాయని పశు వైద్యాధికారులు నాగశైలజ, శ్రీలక్ష్మి తెలిపారు.

పీ4 సర్వేలో గుర్తించిన కుటుంబాలకు చేయూత

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

గోస్పాడు: పీ4 సర్వే ద్వారా గుర్తించిన 43,021 బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు మార్గదర్శులను అన్వేషించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం పలు అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పేదరికాన్ని నిర్మూలించేందుకు పీ4 సర్వే చేసి రాష్ట్రంలో ఉన్న సంపన్నులను మార్గదర్శులుగా, అత్యంత పేదవారిని బంగారు కుటుంబాలుగా గుర్తించి వారికి అవసరమైన చేయూతను ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 43,021 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. అదే విధంగా జిల్లా పరిధిలో ఉన్నత స్థాయి వ్యక్తులను గుర్తించి మార్గదర్శులుగా నమోదు చేయాలన్నారు. జిల్లా అధికారులు కూడా బంగారు కుటుంబాలకు చేయూత ఇవ్వాలని కోరారు.

బ్లడ్ స్టోరేజ్ యూనిట్ ప్రారంభం

జిల్లా కేంద్రంలో కెనాల్ కాంపౌండ్‌లోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయంలో త్వరలో రక్త నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీలో వెయ్యి రూపాయలు చెల్లిస్తే జీవితకాలం సభ్యత్వం ఉంటుందని, రూ.12 వేలు చెల్లించి వైస్ ప్యాట్రాన్‌గా, రూ.25 వేలు చెల్లించి ప్యాట్రాన్‌గా ఉండే అవకాశం ఉందని, ప్యాట్రాన్, వైస్ ప్యాట్రాన్‌కు ప్రెసిడెంట్ చేతుల మీదుగా సర్టిఫికెట్, మిగతా వారికి గవర్నర్ చేతులమీదుగా సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా అధికారులు రూ.1000, ఆధార్ కార్డు, 2 ఫొటోలు ఇచ్చి శాశ్వత సభ్యత్వం పొందాలన్నారు.జేసీ విష్ణుచరణ్, డీ ఆర్‌ఓ రామునాయక్,డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి

మే 2 నుంచి జూన్ 12వ తేదీ వరకు 12 రకాల థీమ్స్‌తో కిశోర వికాసం ప్రత్యేక కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని జిల్లా స్థాయి కిశోర్ వికాస సమ్మర్ క్యాంపు కార్యక్రమ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి చేయడం ద్వారానే వాటిని పూర్తి స్థాయిలో రూపుమాపే అవకాశం ఉంటుందన్నారు. వివాహాలను తప్పనిసరిగా రిజిస్టర్ చేయడం ద్వారా బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయవచ్చని అభిప్రాయపడ్డారు. డ్రాప్ ఔట్స్‌ను తిరిగి పాఠశాల, కళాశాలలో చేర్పేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రతి రోజు లక్ష పనిదినాలు కల్పించండి

గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ప్రతి రోజు లక్ష పనిదినాలు తప్పనిసరిగా కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంపీడీఓలను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య తదితరులతో సమీక్షించారు. ఆత్మకూరు, నందికొట్కూరు, వెలుగోడు, పగిడ్యాల మండలాల్లో తక్కువ వేజ్ రేటు వచ్చినట్లు తెలిపారు. బనగానపల్లె, బేతంచెర్ల మండలాల్లో తక్కువ పురోగతి ఉందన్నారు. అవుకు, నందికొట్కూరు మండలాల్లో ఉపాధి వేతన దారుని సగటు కూలి అధిక శాతం సాధిస్తుంటే కొత్తపల్లి, వెలుగోడు, పాములపాడు మండలాలు తక్కువ రేటు రావడానికి గల కారణాలు ఏంటని అధికారులను ప్రశ్నించారు.

మోడల్ ఎంసెట్‌కు విశేష ఆదరణ

నంద్యాల(న్యూటౌన్): ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నంద్యాలలో సోమవారం జరిగిన ఎస్ఎఫ్ఐ మోడల్ ఎంసెట్‌కు కూడా విశేష స్పందన లభించిందని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజా, ఎంఆర్ నాయక్ తెలిపారు. వారు మాట్లాడుతూ ఎంపీసీ, బైపీసీలలో పేపర్ చాలా బాగుందని, పబ్లిక్ ఈఏపీసెట్‌లో మంచి ర్యాంకు తెచ్చుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఏప్రిల్ 29న మోడల్ నీట్ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సైపుల్లా, శివకుమార్, రాజు, సిద్దు పాల్గొన్నారు.

రేపు వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా 'బత్తి గుల్'



మాట్లాడుతున్న నంద్యాల ముస్లిం జేఏసీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఏప్రిల్ 30వ తేదీన రాత్రి బత్తి గుల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మౌలానా అబ్దుల్ రషాది తెలిపారు. సోమవారం డబ్రాల్ మసీదులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. వక్ఫ్ చట్టం-2025కి వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు మార్గదర్శకంలో దేశవ్యాప్తంగా శాంతియుత నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఏప్రిల్ 30వ తేదీన రాత్రి 'బత్తి గుల్' కార్యక్రమంలో భాగంగా 15 నిమిషాలు పాటు లైట్ ఆఫ్ చేసి నిరసన తెలపాలని కోరారు. ఇది అన్యాయమని, మేము మేలుకుని ఉన్నామని.. మా హక్కుల సాధన కోసం పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని తెలియజేయడానికే ఈ కార్యక్రమన్నారు. కార్యక్రమంలో నంద్యాల ముస్లిం జేఏసీ గౌరవాధ్యక్షులు మహమ్మద్ అబులైస్, మస్తాన్, ఎస్‌డీపీఐ అధ్యక్షులు ఎజాస్ హుసేన్, బాబా ఫక్రుద్దీన్, మజీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న సీహెచ్‌ఓలు

గోస్పాడు: వైద్యశాఖలో ఎన్‌హెచ్‌ఎం కింద పని చేస్తున్న సీహెచ్‌ఓల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎంసీఏ జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ అన్నారు. నంద్యాలలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నామని తెలపారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఎన్‌హెచ్‌ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ఆరేళ్లు దాటిన సీహెచ్‌ఓలను క్రమబద్ధీకరించాలని, ప్రతి నెలా వేతనంతో పాటు ఇన్సెంటివ్, ఏటా 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. సంఘం నాయకులు, ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

కోలుకోలేక మహిళ మృతి

పాములపాడు: ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు భార్య కోలుకోలేక సోమవారం మృతిచెందింది. ఈ నెల 2న ఇస్కాల గ్రామానికి చెందిన రైతు సోమేశ్వరుడు అప్పుల బాధ భరించలేక తల్లి శివమ్మ, భార్య లావణ్య(28), కూతురు నిఖిత, కుమారుడు భరత్‌లతో కలిసి శీతల పానియంలో గడ్డి మందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు యత్నించారు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా భరత్ ఈనెల 22న మృతిచెందగా, లావణ్య సోమవారం మృతి చెందింది.